# ఎన్నికల వేళ డీఎస్సీ ఓ డ్రామా!



కోట,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : పాదయాత్రతో పాటు గత శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏటా జాబ్ క్యాలండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామంటూ సీఎం జగన్ పలు సార్లు హామీలు గుప్పించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ విడుదల చేస్తామని గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చి నాలుగు న్నరేళ్లు దాటినా ఒక్క డీఎస్సీ విడుదల చేయలేదు. ఎన్నికల సమీపస్తున్న తరుణంలో తాజాగా మంత్రిమండలిలో మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణ యిచడం,వైకాపా సర్కారు దగాకు గురి చేసినట్లేనని నిరుద్యోగ యువత మండి పడుతోంది. నిరుద్యోగుల్లో ప్రభుత్వం పైఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకు కో డానికి డీఎస్సీ నోటిఫికేషన్అంటూ మభ్య పెడుతోందని నిరుద్యోగులు వాపో తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టులు మాత్రమే భర్తీ చేయాలని నిర్ణయించారు.. ఉన్న ఖాళీలను 117 జీఓ ముసుగులో కుదించిచేశారు. విద్యార్దులు. ఉపాధ్యా యులు నిష్పత్తి తగ్గించారు. ఈ నేపధ్యంలో ఆంగ్లం, గణితం, పీఈటి,పోస్టుల మాత్రమే ఖాళాలున్నాయి. ఇతర సబ్జెక్టుల్లో రెండెంకలు కూడా కనిపించడం లేదు. కేవలం జిల్లా పరిషత్తు, ప్రభుత్వ పురపాలక, సంక్షేమ, ఆశ్రమ తదితర పాఠశాల్లో ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం,గతంలో వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసి భర్తీ చేసే వారు. అన్నీ కలిపి ఒకే ప్రకటన ద్వారా భర్తీ చేయడం కూడా అభ్యర్దులకు నష్టమే.

**అప్రెంటీస్ విధానం:**

కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు అప్రెంటిస్విధానం అమలు చేయాలని నిర్ణయించారు. గతంలో ఈ విధానం ఉండేది, ఉద్యోగంలో చేరిన మొదటి సంవత్సరం రూ 1200,రెండో సంవత్సరం, రూ 1500 వేతనం ఇచ్చేవారు. మూడో సంవత్సరం అప్రెటింస్ ముగుస్తుంది. అప్పటి నుంచి రెగ్యులర్ వేతనం ఇచ్చేవారు. తరువాత ఈ విధానం రద్దు చేశారు, తాజాగా మళ్లీ అప్రెంటిస్ విధానం పునరుద్దరించాలని నిర్ణయించారు.దీనిపై నిరుద్యోగలు, విద్యార్ధి సంఘాలు నుంచి తీవ్ర విమర్శలు వెల్లుత్తుతున్నాయి.




తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# కాణిపాకం ఈఓగారూ... ఇదేం పని!

## -తప్పుడు చిరునామాతో ఓటరు నమోదా?



1378 | 4 | SQB2154508
ఓటరు పేరు : వెంకటేశు అగ్గిడి
తండ్రి పేరు: లేట్ గోవిందప్ప అగ్గిడి
ఇంటి సంఖ్య : 1-1
వయస్సు : 56 లింగము : పు

1377 | 4 | SQB2154490
ఓటరు పేరు : విజయ అగ్గిడి
భర్త పేరు: వెంకటేశు ఏ
ఇంటి సంఖ్య : 1-1
వయస్సు : 45 లింగము : స్త్రీ

1380 | 4 | SQB2154599
ఓటరు పేరు : వెంకట సుమంత్ కుమార్ అగ్గిడి
తండ్రి పేరు: వెంకటేశు ఏ
ఇంటి సంఖ్య : 1-1
వయస్సు : 28 లింగము : పు

తప్పుడు చిరునామాతో ఓటర్లుగా నమోదు చేసుకున్న ఈఓ వెంకటేష్,భార్య, కుమారుడు

కాణిపాకం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ఆయన ఓ ప్రసిద్ధ దేవాలయానికి కార్య నిర్వహణాధికారి... ప్రతినిత్యం...దేవుని సన్నిధిలో ధర్మ ప్రచారం వింటూ వుంటారు... ఏది ధర్మం... ఏది అధర్మం... అనేది ఆయన చెవిన పడుతూనే వుంటాయి... అయినా అవేవి పట్టనట్టు అక్రమాలను అరికట్టే స్థాయిలో బాధ్యతాయుతమైన అధికారిగా వున్న వ్యక్తి తప్పుడు చిరునామాతో తాను నివాసముంటున్న గ్రామ పంచాయతీలో ఓటరుగా నమోదు చేసుకున్న ఘటన సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం గ్రామ పంచాయతీలో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆలయన ఏ వుద్దేశ్యంతో ఓటు నమోదు చేసుకున్నారో తెలియదు కాని ఆయన చర్యలు విమర్శలకు తావిస్తోంది. సంఘటనకు సంభందించి వివరాల్లోకి వెళితే... రాష్ట్ర రెవెన్యూశాఖలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి అయిన అగ్గిడి వెంకటేష్ డిప్యూటేషన్పై రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు బదిలీ చేయించుకుని ప్రస్తుతం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం కార్య నిర్వహణాధికారిగా గత రెండేళ్ళుగా పనిచేస్తున్నారు. ఈయన ప్రస్తుతం ఈఓగా పనిచేస్తూ ఈఓ కార్యాలయం వెనుక వైపున వున్న ఈఓ క్వార్టర్స్ లో కుటుంబసభ్యులతో కలసి కాపురముంటున్నారు. ఈనేపథ్యంలో ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు దేశంలో ఏవ్యక్తి అయినా తాము కాపురముంటున్న ప్రాంతంలో, లేదా గ్రామంలో ఓటరుగా నమోదు చేసుకునే హక్కును భారత రాజ్యాంగం కల్పించింది. అయితే రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి అయిన ఈఓ అగ్గిడి వెంకటేష్ ఎన్నికల నిబంధనలను అతిక్రమించి తప్పుడు చిరునామాతో గ్రామంలోని ఓ వార్డులో తాను తన భార్య, కుమారున్ని ఓటరుగా నమోదు చేయించడం వెలుగులోకి వచ్చింది. కాణిపాకం గ్రామ పంచాయతీలో 7 వార్డులుండగా అందులో 1వార్డులో తమ పేర్లును ఓటర్లుగా నమోదు చేయించారు. ఈమేరకు కాణిపాకం గ్రామ పంచాయతీ 1వార్డు (ఎస్సీ వాడ)లోని 1-1 ఇంటి నెంబరుతో అగ్గిడి వెంకటేష్ (ఓటరు కార్డు నెంబర్;1378), అగ్గిడి విజయ (నెంబర్;1377), వెంకట సుమంత్ కుమార్ అగ్గిడి (నెంబర్; 1380) ఓటర్లుగా నమోదైవున్నారు. దేవస్థానంకు సంభందించిన ఈఓ క్వార్టర్స్ లో కాపురముంటున్న డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి అయిన అగ్గిడి వెంకటేష్, తాను కాపురముంటున్న ఇంటి నెంబర్తో కాకుండా తప్పుడు చిరునామాతో గ్రామ పంచాయతీ పరిధిలోని కాణిపాకంఎస్సీ వాడ చిరునామాతో ఓటర్లుగా నమోదు చేయించుకోవడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఓటర్ల నమోదు కోసం తప్పుడు చిరునామా ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఓటరుగా నమోదు చేసుకున్న చిరునామాలోని ఇంటిలో దామోదరం అనే వ్యక్తి ఈన భార్య, కుమారుడితో కలసి కాపురముంటున్నారు. దీన్ని బట్టి ఈఓ వెంకటేష్ ఓటరు నమోదు పత్రంలో వుద్దేశ్యపూర్వకంగానే తప్పుడు చిరునామా అందించినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.దీనిపై ఎన్నికల్ కమీషన్ లేదా జిల్లా ఎన్నికల అధికారి సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐరాల మండల జనసేన నాయకులు కాణిపాకం రాజ్కుమార్ ఒక ప్రకటనలో డిమాండు చేశారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి అయిన కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేష్ అక్రమాలను అరికట్టాల్సింది పోయి తానే అక్రమాలకు పాల్పడడం ఎంత వరకు సమంజమని ఆయప ప్రశ్నించారు.

**నాకు తెలియదు... ఎన్నికల సంఘం వారే కేటాయించారు:ఈఓ అగ్గిడి వెంకటేష్**

తన ప్రమేయం లేకుండా ఎన్నికల సంఘం వారే తన ఓటుతో పాటు తన భార్య, కుమారుడి ఓటరు కార్డులకు ఇంటి నెంబర్ కేటాయించారని కాణిపాకం ఆలయ ఈఓ వెంకటేష్ ఒక ప్రకటనలో వివరణనిచ్చారు. ఎన్నికల నిబంధనల మేరకే తాను కాపురముంటున్న దేవస్థానం ఈఓ క్వార్టర్స్ చిరునామాతో తాను నివాసముంటున్న కాణిపాకం గ్రామ పంచాయతాలో ఓటరుగా నమోదు కోసం ధరఖాస్తు చేసుకున్నానన్నారు. అయితే తాను కాపురముంటున్న కార్టర్స్ కు సంభందించి పంచాయతీకి ఇంటి పన్ను చెల్లిస్తున్నామని, అయిన డోర్ నెంబర్ను కేటాయించలేదన్నారు.దీనితో ఎన్నికల సంఘం వారే తమ ఓట్లుకు డోర్ నెంబర్ కేటాయించారని ఈఓ వెంకటేష్ తెలిపారు.

# అలిగి ఆలయంలో సంచరించాడట!

**-అర్ధరాత్రి ఆలయ ప్రహరిగోడ దూకి లోపలికి వెళ్ళిన బాలుడు -రాత్రి అంతా ఆలయ పరిసరాల్లో సంచారం -నిద్రమత్తులో భద్రతా సిబ్బంది -శ్రీకాళహస్తీశ్వరాలయంలో మరో సంఘటన**



శ్రీకాళహస్తి,పిబ్రవరి 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత తెల్లారితే శుక్రవారం ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో సంచరిస్తుండగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డెప్యూటీ ఇఓ వెంకట సుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుమేరకు తొట్టంబేడు మండలం వినాయకనగర్కు చెందిన 14 బాలుడు ఇంట్లో అలిగి వెళ్ళినట్లు బాలుని తల్లి దండ్రులు వివరించినట్లు తెలిపారు. ఆ బాలుడు సక్రంగా చదవటం లేదని మందలించగా ఇంటినుంచి అలిగి వెళ్ళినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లు వివరించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్లులో భాగంగా సన్నిధివీధి వైపు ఇంజనీరింగ్ విభాగం పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో వారు గురువారం రాత్రి పనులు నిర్వహించే చోట నిచ్చేన వదలిపెట్టి వెళ్ళినట్లు చెబుతున్నారు. ఈ నిచ్చెన మీద నుంచి బాలుడు ఆలయం గోడలు దాటి రూ.500 రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుమండపంపై నుంచి ఆలయం లోపలకు దిగినట్లు సమాచారం. అయితే ఆతన్ని గమనించిన అక్కడ గస్తీ తిరిగే సిబ్బంది అదుపులో తీసుకున్నట్లు పట్టణంలో చర్చ జరుగుతుంది. పోలీసులకు ఫిర్యాదు ఇచ్చిన వారిలో డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య ఎఇఓ బిఎల్ఎన్ ప్రసాద్, ఆలయ పర్యవేక్షణాధికారి సి.నాగభూషణం యాదవ్లు ఉన్నారు.అయితే ఆలయానికి సంబంధించిన భద్రత విషయంలో ప్రతిపాదనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు.ఇప్పటికైనా అధికారులు తగుచర్యలు తీసుకోకుంటే భవిష్యత్తు అగమ్యగోచరం కాగలదు.

# పరిశుభ్రతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

**-పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ అధితి సింగ్ సూచన**



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : తిరుపతి పుణ్యక్షేత్రంలో పరిశుభ్రతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పారిశుధ్య సిబ్బందికి తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ సూచించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం నగరంలోని 23, 24, 25, 28 వార్డుల మాస్టర్ పాయింట్ల వద్ద, న్యూ బాలాజీ కాలనీ డ్రైవర్ల మస్టర్ పాయింట్ల వద్ద హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ అలిపిరి, స్విమ్స్ సర్కిల్, గిరిపురం, శాంతినగర్ ఏరియాల్లో కమిషనర్ అధితి సింగ్ పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. ఆమె పారిశుద్ధ్య సిబ్బందితో మాట్లాడుతూ తిరుపతిలోని ప్రజలతో పాటు నిత్యం లక్షల్లో వస్తున్న యాత్రికలు కూడా పరిశుభ్రకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలన్నారు. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయకుండా కట్టడి చేయాలని, ముఖ్యంగా పారిశుద్య సిబ్బంది సకాలంలో నిర్ణయించిన సమయానికే ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు వేరుగా సేకరించాలన్నారు. ఇంటింట చెత్త సేకరణ తరువాత గార్బేజ్ సెంటర్ల వద్ద తడిపొడి చెత్తను ఏవిధంగా వేరు చేస్తున్నారని న్యూ బాలాజీ కాలనీ వద్ద వున్న గార్బేజ్ పాయింట్ను పరిశీలిస్తూ పూర్తి స్థాయిలో తడి పొడి చెత్తలను వేరు చేసి తూకివాకం ప్లాంట్కి తరలించాలని కమిషనర్ సూచించారు. కమిషనర్ వెంట డిప్యూటి కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్వైజర్ చెంచెయ్య పాల్గొన్నారు.

# డిప్యూటీ సిఎంపై పనిచేయని అసమ్మతి

**- జిడినెల్లూరు అసెంబ్లీ అభ్యర్థిగా మళ్ళీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి - చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మరోసారి రెడ్డప్పకు అవకాశం**



ఎంపీ రెడ్డప్ప,డిప్యూటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోను గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా మరోసారి పోటీ చేయడానికి డిప్యూటీ సిఎం నారాయణస్వామికి అవకాశం ఇవ్వకూడదని పార్టీలోని అసమ్మతి నేతలు గాండ్రించినా ఫలితం లేకపోయింది. వైకాపా అధిష్టానం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఆరవ జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాలో గంగాధరనెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి డిప్యూటీ సిఎం నారాయణస్వామి మరోసారి పోటీ చేస్తారని, చిత్తూరు పార్లమెంటు స్థానం నుండి ప్రస్తుతం ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న రెడ్డప్పకు మరోసారి ఇక్కడి నుండి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడానికి పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వైకాపా అధిష్టానం పదిహేను రోజుల క్రితం జిడినెల్లూరు అసెంబ్లీ అభ్యర్థిగా నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మరోసారి రెడ్డప్పను ఖరారు చేసినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని డిప్యూటీ సిఎం నారాయణస్వామి వ్యతిరేక వర్గం నాయకులు పెనుమూరు పులిగుండులో సమావేశమై డిప్యూటీ సిఎం నారాయణస్వామిపై తిరుగుబాటు చేశారు. మరోసారి డిప్యూటీ సిఎంను జిడి నెల్లూరు నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా ఖరారు చేస్తే కచ్చితంగా ఆయనను ఓడిస్తామని హెచ్చరించారు. దీనిపై పార్టీ అధిష్టానం చిత్తూరు పార్లమెంటు, జిడినెల్లూరు అసెంబ్లీ స్థానాలకు పేర్లు ఖరారు చేయకుండా పెండింగ్లో వుంచింది. జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డిప్యూటీ సిఎం వ్యతిరేకులను శాంతపరచడానికి పార్టీ అధిష్టానం ఒక రాజీ ఫార్ములాను సిద్ధం చేసింది. ఈ మేరకు ప్రస్తుతం డిప్యూటీ సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే స్థానం నుండి ప్రస్తుత చిత్తూరు సిట్టింగ్ ఎంపీ రెడ్డప్పను పోటీ చేయించాలని, అలాగే డిప్యూటీ సిఎం నారాయణ స్వామిని చిత్తూరు ఎంపీ స్థానం నుండి పోటీ చేయించాలని భావించారు.

అయితే డిప్యూటీ సిఎం నారాయణ స్వామి తాను జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసి మంచి మెజార్టీతో గెలిచి వస్తానని మొండికి వేయడం, మరోవైపు ఎంపీ రెడ్డప్ప సైతం జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో ఈ స్థానాలపై గత కొన్ని రోజులుగా వైకాపా అధిష్టానం తర్జనభర్జన పడింది. ఎట్టకేలకు వైకాపా పార్టీ అధిష్టానం ఇది వరకు ఖరారు చేసిన విధంగానే జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి మరోసారి డిప్యూటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ స్థానం నుండి మరోసారి రెడ్డప్పను పోటీకి నిలపడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిప్యూటీ సిఎం నారాయణస్వామిపై ఇప్పటి వరకు అసమ్మతి స్వరం వినిపించిన వైకాపా నేతలు ఇప్పుడు ఏం చేస్తారో వేచి చూడాల్సివుంది.

# ఎలక్టోరల్ నమోదు తప్పిదం జరగకుండా వ్యవహరించాలి

**-కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మిషా**



వీడియో కాన్ఫిరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : ఎలక్టోరల్ నమోదు, తొలగింపుల్లో ఎలాంటి తప్పిదం జరగకుండా ఈఆర్ఓలు బాధ్యతగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనలను అనుసరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, విజయవాడ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సాధారణ ఎన్నికల సన్నద్ధత, పలు అంశాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మిషా, జెసి శుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్, డిఆర్ఓ పెంచల కిషోర్ తదితర సంబంధిత ఈఆర్ఓలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనలు ఎన్నికల నిధులపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఎన్నికల సన్నద్ధతపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, నోడల్ అధికారులు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిఈఓకు వివరిస్తూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో, ఎన్నికల పారదర్శకంగా నిర్వహించేలా అన్ని రకాలుగా చర్యలు చేపడుతున్నామని పలువివరాలు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు ఈఆర్ఓలతో జిల్లా కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. సాధారణ ఎన్నికల 2024 సన్నద్ధతపై నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా బాధ్యతగా నిర్వర్తించాలని అన్నారు. ఈ సమీక్షలో ఈఆర్ఓలు కోదండరామిరెడ్డి, నిషాంత్ రెడ్డి, చంద్రముని, రవిశంకర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు చంద్రశేఖర్ నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు, ఎలక్షన్ తహశీల్దార్ చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : విద్యాశాఖ పై రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, కోట్ల రూపాయలు వెచ్చించి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలో ఉండేలా విద్యా శాఖ కృషి చేయాలని, గృహ నిర్మాణంపై రోజు వారీ సమీక్షతో ప్రణాళికా బద్ధంగా పురోగతి సాధించాలని మతా శిశు సంక్షేమం, అభివృద్ధి శాఖ మాతా శిశు మరణాలను తగ్గించేలా వారికి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ సక్రమంగా అందేలా చూడాలని, గ్రామ,వార్డు సచివాలయాలు ప్రజలకు విసృత సేవలు అందించాలని పలు అంశాలపై సంబంధిత అఇకారులను జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీ షా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ముందుగా విద్యా శాఖ, సర్వ శిక్ష అభియాన్, కేజిబివి, ఆదర్శ పాఠశాలలు, నాడు నేడు కింద చేపడుతున్న నిర్మాణాలు, మరమ్మత్తులు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా డిఈఓవి శేఖర్ విద్యాశాఖ కార్యకలాపాలపై వివరించారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద నాణ్యతగా అమలు కావాలని ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డ్ల ఏర్పాటుతో పాఠశాలల్లో నూతన టెక్నాలజీతో పిల్లలకు మంచి బోధన అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, విద్యార్థులకు ప్రభుత్వం బైజూస్ ట్యాబ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. తద్వారా పిల్లలకు తరగతులు అయిపోయిన తర్వాత కూడా వారికి ఏమైనా సబ్జెక్టుపై సందేహాలు ఉన్నా క్లారిపై చేసుకునే అవకాశం ఉందని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చూడాలని తెలిపారు. నాడు నేడు ద్వారా పాఠశాలల రూపు రేఖలు పూర్తిగా మారిపోతుందని, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆధునిక హంగులతో తీర్చి దిద్దుకున్నాయని, పెండింగ్ నాడు నేడు పనులు సకాలంలో గడువు లోపు పూర్తి చేసేలా ఉండాలని అఇకారులకు సూచించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్య, బాలికా విద్యను ప్రోత్సహించేలా చర్యలు ఉండాలని ప్రతి బడి ఈడు పిల్లవాడు బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పలు వ్యవస్థలపై అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సిఈవో, డిఎల్డిఓ ఆదిశేషారెడ్డి, డిఎల్డిఓలు వాణి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 1 నుండి ఇంటర్ పరీక్షలు

**- పక్కా నిర్వహణకు ఏర్పాట్లు**
**- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్**



చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: మార్చి 1 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాటు చేపట్టి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. డిఆర్ఓ ఛాంబర్లో శుక్రవారం డిఆర్ఓ రాజశేఖర్ ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణ కోసం 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియేట్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 32,757 విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందులో ఫస్ట్ ఇంటర్కు 15,905, సెకండ్ ఇంటర్కు 16,852 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్షలు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వుంటాయని విద్యార్థులు ఉదయం 8.30 గంటలకల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్టికెట్లను సంబంధిత కళాశాలలు విద్యార్థులకు సకాలంలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో సిటింగ్, లైటింగ్, మంచినీరు, మరుగుదొడ్లు వుండేలా చూడాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటకల్లా చేరుకొనే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, పరీక్షల సమయంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్ కో అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎఎన్ఎంలను అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను డిఆర్ఓ ఆదేశించారు. ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా కేంద్రాల సమీపంలో వున్న జెరాక్స్ షాపులను మూసి వేయాలన్నారు. అలాగే పరీక్షలు జరిగే కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులను ఆదేశించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇవిఓ సయ్యద్మౌలాలా, డిఇసి సభ్యులు దయానందరాజు, బాల సుబ్రమణ్యం రాజు, మురళీకృష్ణ, డిఇఓ విజయేంద్రరావు, వైద్య, ఆరోగ్య, విద్యుత్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# 15,16,17 మూడురోజులు...టైమ్స్లాట్ టోకెన్లు రద్దు

**-ఈనెల 12నుండి 16వరకు టిబికౌంటర్, ఎంబిసి మూసివేత -సామాన్యభక్తుల సౌకర్యాలకే ప్రాధాన్యత -టిటిడి ఈఓ ధర్మారెడ్డి**



తిరుమల,ఫిబ్రవరి 2ప్రభాతవార్తప్రతినిధి: మాఘమాసం సప్తమితిధిన 16వతేదీ శుక్రవారం రథసప్తమి పర్వదినం కారణంగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడురోజులు సర్వదర్శనం టైమ్స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేస్తున్నట్లు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. 15,16,17తేదీల్లో వరుసగా ఈ టోకెన్లు జారీ ఉండదన్నారు. అంతేగాక 16వతేదీ సామాన్యభక్తుల వసతికే ప్రాధాన్యత నిచ్చేలా తిరుమలలోని సిఆర్ఓలో ఉన్న టిబి కౌంటర్, ఎంబిసి 34 గదుల కేటాయింపు కౌంటర్లను 14వతేదీ ఉదయం నుండి 16వతేదీ అర్ధరాత్రి 12గంటల వరకు మూసివేస్తున్నారు. పూర్తిగా సిఆర్ఓ, పద్మావతి విశ్రాంతి భవనాల సముదాయాల్లో మాత్రమే గదుల కేటాయింపు ఉంటుందన్నారు. టిటిడి భద్రత విభాగం, పోలీసు అధికారులు సమన్వయంతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. 16వతేదీ రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు కటాక్షించనున్నారు. ఇందుకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున సౌకర్యాలు, భద్రత, వాహనాల పార్కింగ్పై టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్షించారు. టిటిడి జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, సిఈ నాగేశ్వరరావు, సివిఎస్ఓ నరసింహకిశోర్, ఎస్వీబిసి సిఈఓ షణ్ముఖకుమార్, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, డిప్యూటీ ఈఓలు భాస్కర్, శెల్వం,రాజేంద్రుడు, ఎస్ఇ 2 జగదీశ్వర్రెడ్డి, ఎస్టేట్ అధికారి మల్లికార్జున,ఐటి జిఎం సందీప్రెడ్డి, పిఆర్ఓ నీలిమ, సిఐలు జగన్మోహన్రెడ్డితో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐఆర్ఎం కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :



స్థానిక ఐఆర్ఎం డిగ్రీ కాలేజీలో శుక్రవారం ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈసందర్భంగా 27మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. వివిధ మల్టీనేషనల్ కంపెనీల ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. బ్రాండ్ 4 బ్రాండ్ సంస్థకు నలుగురు, రాండ్స్టాడ్ ఇండియాకు 19మంది, పల్లె టెక్నాలజీస్ సంస్థకు నలుగురు మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులకు వందశాతం ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యా ర్థులను అకడమిక్ డైరెక్టర్ డా॥ మధుసూధన్‌రెడ్డి అభినందించారు.

## ద్రవిడ వర్సిటీ ప్రొఫెసర్‌కు కర్ణాటక ప్రభుత్వం అవార్డు



**కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ద్రవిడ వర్సిటీలోని జానపద విభాగం ప్రొఫెసర్ ఎంఎన్ వెంకటేశకు కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కుందనగర్ గాడినాడ సాహిత్య పురస్కారంతో సత్కరించింది. కర్ణాటక సిఎం సిద్ధరామయ్య చేతుల మీదుగా అవార్డుతో పాటు ఐదు లక్షల నగదు ప్రోత్సాహకాన్ని వెంకటేశ అందుకున్నారు. కన్నడ అధ్యయన రంగంలో ఆయన చేసిన సేవలకు ఈ అవార్డు లభించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆచార్య వెంకటేశను ద్రవిడ వర్సిటీ ఉపకులపతి ఆచార్య మధుజ్యోతి, రెక్టార్ ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డిలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటినుంచి ఎన్టీఆర్ స్మారక వాలీబాల్ టోర్నీ



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మున్సిపల్ పరిధి డికెపల్లిలో నేటినుంచి దివంగత ఎన్టీఆర్ స్మారక వాలీబాల్ టోర్నీని తెదేపా శ్రేణులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్సీ డా॥కంచర్లశ్రీకాంత్‌ఆవిష్కరించారు. విజేతలకు 30వేలు, రెండో బహుమతిగా 20వేలు, మూడో బహుమతిగా 10వేలు, ట్రోఫీలు అందించడం జరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రవేశ రుసుం 700రూ.లు అన్నారు. కార్యక్రమాల్లో పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, నేతలు సత్యేం ద్రశేఖర్, గనిఉల్లా, నబీ ఉల్లా, జావిద్, చలపతి, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యంకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మహిళలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను మహిళలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకంలో 25లక్షల దాకా ఉచిత చికిత్సలు చేయించుకునే అవకాశం కల్పించారన్నారు. కార్యక్రమంలో సిడిపిఓ అరుణశ్రీ, కౌన్సిలర్లు సయ్యద్ అలీ, గణపతి, రాజ్‌కుమార్, విజయ్, మోహన్‌రాం, జగన్, అరవింద్ పాల్గొన్నారు

## వైకాపా యూత్ విభాగం అధ్యక్షుడిగా నితిన్‌రెడ్డి

**రామకుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గ వైకాపా యువజన విభాగం అధ్యక్షుడిగా రామకుప్పం జడ్పీటిసి నితిన్‌రాఘవరెడ్డిని నియమిస్తూ జిల్లా యూత్ అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నియామకపత్రాలను ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ చేతుల మీదుగా నితిన్‌రెడ్డి అందుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యలు అప్పగించిన సిఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు బాబురెడ్డి, చంద్రారెడ్డి, మురుగేష్, చెంగారెడ్డి, కేశవరెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

సోమల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ ఈనెల 3న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. మండలంలోని 15పంచాయతీల్లోనూ గ్రామ సభలు తూతూ మంత్రంగానే నిర్వహించారు. జరిగినపనుల వివరాలు ప్రజలకు తెలపకుండా నిర్వహించారన్న విమర్శలున్నాయి. సామాజిక తనిఖీ సభను సైతం ఎవరికీ సమాచారం అందించేదని, దీనిపై అందరిలో సందేహాలున్నాయని అనుకోవడం వినిపించింది.

## సరస్వతి విగ్రహం ప్రతిష్టాపన

పాలసముద్రం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఇవిడిపురం ఎంపియుపి పాఠశాలలో శుక్రవారం పాఠశాల పూర్వ విద్యార్థులు సరస్వతి విగ్రహంను పాఠశాల హెడ్మాస్టర్ కోదండయ్య ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ కోదండయ్య మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో పాఠశాలలో పలు రకాల పనులు, గోపురం ఏర్పాటు చేయడం, సరస్వతి విగ్రహం ప్రతిష్టించడం జరిగిందన్నారు. అక్షరాలు, అ, ఆలు నేడు ల్యాప్‌టాప్‌లో ఎ,బిలుగా వున్నప్పటికీ ఆ రోజుల్లో గొంతు చించుకొని పద్యాలు, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుల స్వరం మధురంగా వుండేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రాజేంద్రప్రసాద్, గిరిజ, సర్పంచ్ నరసింహరాజు, సచివాలయ ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైకాపా సాంస్కృతిక విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీగా సుధాకర్

పాలసముద్రం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



జిల్లా వైకాపా సాంస్కృతిక విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీగా శ్రీకావేరిరాజపురం పంచాయతీకి వైకాపా నాయకులు సుధాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైకాపా సాంస్కృతిక విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీ సుధాకర్ మాట్లాడుతూ ఎంపిపి శ్యామలా శివప్రకాష్‌రాజు పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో పార్టీ పదవి ఇవ్వడం సంతోషంగా వుందన్నారు. 2024 ఎన్నికల్లో ఎంపిపి శ్యామలా శివప్రకాష్‌రాజులతో కలసి నియోజకవర్గంలో పార్టీని గెలిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంపిపి శ్యామల శివప్రకాష్‌రాజు, వైకాపా నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్‌ను వైకాపా నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

## దోమల నియంత్రణతో వ్యాధులు దూరం

సదుం, ఫిబ్రవరి 2ప్రభాతవార్త

దోమలను నియంత్రించడంతోనే అనేకవ్యాధులు దూరమవుతాయని చెరకువారి పల్లె పీహెచ్‌సీ వైద్యాధికారిగిరిషాఅన్నారు. శుక్రవారంస్థానిక బీసీ గురుకుల పాఠశాల, బాలికలహాస్టల్, ఎస్సీ బాలుర హాస్టలు లోను దోమలనియంత్రణకుమొలాథియాన్‌ద్రావణంపిచికారిచేశారు. కార్యక్రమంలోసబ్‌యూనిట్‌అధికారిసాగర్, ఆరోగ్య పర్యవేక్షకసిబ్బందినీలకంఠ, ఉదయ్‌భాస్కర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, కమ్యూనిటీఅధికారులురషీద్, శ్రావణి, ఆరోగ్య కార్యకర్త రేవతి, వసతి గృహ సంక్షేమాధికారి షరీఫ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భాకరాపేట సిఐగా మస్తాన్‌వల్లీ



భాకరాపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :

భాకరాపేట సిఐగామస్తాన్‌వల్లీ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిఐ సురేంద్రనాథ్‌రెడ్డి తిరుపతి కంట్రోల్ రూమ్‌కు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ నుంచి మస్తాన్‌వల్లీ ప్రమోషన్‌పై ఇక్కడికి నియమతులయ్యారు.

## చంద్రబాబు సభా స్థలం పరిశీలన



గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

ఈ నెల 6న మంగళ వారం రాకదలిరా కార్యక్రమానికి జిల్లాకు విచ్చేస్తున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుగంగాధర నెల్లూరు వద్ద నిర్వహి స్తున్న బహిరంగసభ స్థలాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిపర్తి నాని నియోజక వర్గ ఇచార్జ్ డాక్టర్ థామస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడు కలసి సభాస్థలి ఏర్పాట్లను పరిశీ లించారు. ఈకార్యక్రమంలోస్థానిక నాయకులు మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్, దేవసుందరం, వెంకటేష్, జ్యోతీశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్‌లతో పాటు పలు వురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువుల పండగలో ఘర్షణ

**రామకుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** మండలంలోని మణీంద్రం గ్రామంలో పశువుల పండగ సందర్భంగా యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మణీంద్రం, అత్తికుప్పం గ్రామాలకు చెందిన యువకులు ఎద్దులనే పరుగులు తీయించే విషయంగా గొడవపడ్డారు. దీంతో పలువురు గాయాలపాలై స్థానిక ఆస్పత్రిలో చేరారు. అక్కడ కూడా దాడులకు ఇరువర్గాలు యత్నించగా విషయం తెలుసుకున్న ఎస్సై శివకుమార్ యువకులను వారి గ్రామాలకు పంపించి పండగను నిలిపేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విరాళం

కాణిపాకం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానానికి ఓ భక్తురాలు శుక్రవా రం రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. చెన్నైకు చెందిన తిలకవతి అనేభక్తురాలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,016 రూపా యలను, శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,00,016 రూపాయలను విరాళంగాఅందజేశారు. దాతలు విరాళమొత్తాన్ని ఆలయ సూపరెండెంట్ కోదండ పాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌లకుఅందజేశారు. ఈకార్యక్రమంలోఆలయ అర్చ కులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలి

-మాజీ మంత్రి అమరనాథరెడ్డి

తవణంపల్లె, ఫిబ్రవరి ప్రభాతవార్త:



వచ్చే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం పూతలపట్టు టీడీపీఇన్‌చార్జి కలికిరి మురళీ మోహన్‌తో కలసి మండలం లో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా మోదలపల్లె సర్పంచ్ చలపతితో పాటు జి.వడ్డిపల్లెకు చెందిన మరో50 కుటుంబాలు, దిగువ తడకర గ్రామంలో 15 కుటుంబాలు, పొన్నేదుపల్లె, గాజులపల్లె, సరకల్లు, గురువారిపల్లె, వెంగంపల్లె, జి.గొల్లపల్లె గ్రామాలకు చెందిన 130 కుటుంబాలు వైకాపాను వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికిమాజీ మంత్రిఅమరనాథరెడ్డి, ఇన్‌చార్జి మురళీమోహన్ లు పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, రాష్ట్ర అధికారప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీఅధ్యక్షులు దిలీప్‌నాయుడు, వడ్లపాటి గిరిధర్‌బాబు, జయప్రకాష్ నాయుడు, దొరబాబు చౌదరి, మురార్జియాదవ్, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు. మండల ప్రధానకార్యదర్శి మధుకుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వరచౌదరి, క్లస్టర్‌ఇన్‌చార్జిలు సునీల్ చౌదరి, మోహన్‌నా యుడు, నాయకులు గోపీయాదవ్, శరవణకుమార్, అరుణ, చిట్టెమ్మ, పత్రపల్లె రవిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగాభవానీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో గంగాభవానీకి రాహుకాలాభిషేకం జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహు కాలసమయంలో దంపతుల సమక్షంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో భక్తుకు అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. శిబిరానికి పలమనేరుకు చెందిన సిఎస్. నవీన్‌కుమార్ అతని మిత్రులు కూరగాయలు విరాళంగా అందించారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి, ధర్మకర్త మండలి సభ్యులు రాజేష్, రామదాసు, బుడ్డమ్మ, అధికార, అర్చక, సిబ్బంది వసతులు సమకూర్చారు.

## సమయపాలన పాటించి మంచి పేరు తేవాలి : కళ్యాణ్‌భరత్

-'వార్త కు స్పందన

చౌడేపల్లి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :

వైద్యులు సమయపాలన పాటించి ఆరోగ్య కేంద్రానికి మంచి పేరు తేవాలని హెచ్‌డిఎస్ ఛైర్మన్ కె.కళ్యాణ్‌భరత్ అన్నారు. "చౌడేపల్లి ఆసుపత్రికి జబ్బు చేసింది"అన్న శీర్షికన వార్తలో కథనం వెలువడిన విషయం విధితమే... స్పందించిన హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణ్‌భరత్ శుక్రవారం స్థానికఆరోగ్య కేంద్రంలో వైద్యాధి కారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసారు. వైద్యులు క్రమం తప్ప కుండా ఆరోగ్య కేంద్రానికిరావాలనీ, రోగ నిర్ధారణాధికారి సైతం సమయ పాలన పాటించాలన్నారు. ఇకపైఎవరైనా నిబంధనల ప్రకారం నడుచుకోకపోతే శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. వైద్యాధికారి పవన్‌కు మార్, యుడిసి రెడ్డెప్పరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రాక్షస పాలనను అంతమొందించాలి - నెలవల

నాయుడుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారే గానీ గత నాలుగున్నరేళ్లలో ఒక్క అభివృద్ధి పని అయినా చేశారా అని ఆయన ప్రశ్నించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి కావాలని కోరుకుంటూ టీడీపీ యువనాయకులు అశోక్‌కుమార్ ఇచ్ఛా పురం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నాయుడుపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ అరచేతిలో వైకుంఠం చూపి స్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు టిడిపితోనే సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త

తెలుగుదేశం అధికారంలోకివస్తేనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమ వుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరులో మాజీ కౌన్సిలర్ గుండాల భారతి ఆధ్వర్యంలో సుమారు 400 మందికి పైగా యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, లోకేష్, శివకుమార్, మురళి, సాయితేజ, నాని, వెంకి, మహేష్, సన్ని, ప్రసన్న, కుమార్‌సాయి తదితరులను కండువాలు కప్పి ఆహ్వానించారు.

## ఆలయ పునర్నిర్మాణానికి వైభవంగా భూమిపూజ

కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త



కోట మండలం తిమ్మానాయుడుపాలెంలో శుక్రవారం ఆలయ ధర్మకర్త మల్లాపు రమేష్ ఆధ్వర్యంలో ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. శ్రీభ్రమరాంబ సమేత శ్రీసంతకాళహస్తిస్వామి ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా భూమిపూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రమేష్ మాట్లాడుతూ గ్రామస్థులు, దాతల సహకారం, దేవా దాయశాఖ తోడ్పాటుతో రెండున్నర కోటి రూపాయల అంచనాలతో దేవాలయాన్ని కార్తీకమాసం నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ దంప తులను, యరటపల్లి మధుసూదన్‌రెడ్డిని ఆలయ ధర్మకర్త రమేష్ శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ఆనందమూర్తి, బాబురెడ్డి, షిరిడిసాయిసేవాసమితిఛైర్మన్‌అల్లం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిట్టమూరులో సామూహిక ఎలుకల నివారణ

**చిట్టమూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో శుక్రవారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ హాజరై వ్యవసాయంలో ఎలుకలు రైతుకు చేస్తున్న నష్టాన్ని నివారించే చర్యలపై అవగాహన కల్పించారు. పొలం గట్లపై ఎలుకల నివారణకు ఉపయోగించే మందునుకలుపుకొని ఎలా వాడాలో సూచించారు. 15 రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయ కులు సుధాకర్, సునంద, దివ్యజ్యోతి, కస్తూరయ్య, అరుణ, సుభ్రుద్దీన్, దినేష్, పెంచలరత్నం తదితరులు ఉన్నారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన ఎలుకల నివారణ మందు ప్యాకెట్లు పెద్ద రైతులకు పంపిణీ చేశారు.

### *వెంకటగిరిలో*

రైతులు సామూహికంగా ఎలుకలను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు ధనంజయ రెడ్డి తెలిపారు. యాతలూరులో ఎలుకల నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏడిఏ నాగార్జునసాగర్, ఏవో సుజాత, ఏఈఓలు రామ్మోహన్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జీతాలు పడ్డాయోచ్..!

**కోట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త** ఇదివరకు జీతాలుఎప్పుడు జమ అవుతాయో అనిఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు ఎదురు చూసేవారు. అలాంటిది శుక్రవారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ అయినట్లు చరవాణిలకు సందేశాలు రావడంతో వారిలో ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. గత సంవత్సర కాలంగా ఉపాధ్యా యులకు ప్రతి నెలా 15వ తేదీ దాటినా జీతాలు పడేవి కాదు. గత రెండు నెలల నుంచి ఒకటి రెండు తేదీల్లోనే ఉద్యోగులకు ప్రభుత్వం జీతాలు ఇస్తుండ టంతో వారిలో కొంతమేర ఆనందం వ్యక్తమవుతోంది.

## రైతులకు మేలు రకం మొక్కలు అందిచడమే లక్ష్యం

పెట్లూరు నిమ్మచీనీ పరిశోధన కేంద్రంప్రిన్సిపాల్ డాక్టర్ సి మధుమతి

వెంకటగిరిరూరల్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:



పెట్లూరులోని డాక్టర్ వైఎస్ఆర్‌హార్టికల్చర్ పరిశోధన కేంద్రంలో నిమ్మతో పాటు ప్రతి ఏటా రైతులకు మేలురకంనిమ్మ, చీనీ మొక్కలు అందించేవిదంగా రంగపూరి నిమ్మపై సాత్‌గూడి చీనీ మొక్కలు అంటు కడుతున్నట్లు పెట్లూరు నిమ్మచీనీ పరిశోధన కేంద్రంప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి తెలిపారు. రంగపూరి నిమ్మపై అంటుకట్టడం వల్లవేరుకుళ్ళు తెగుళ్ళు తట్టుకోని నీటి ఎద్ద డిని తట్టుకుని బీడు భూములల్లో సైతం తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి అందించడమే దీని ప్రముఖ్యత అని వివరించారు. ఉద్యాన వనసాగులల్లో ప్రస్తుతం ముద్ద బంతి సాగు అధిక దిగుబడులతో పాటు సాగు చేసే రైతులకు అధిక అదాయం వస్తున్నటు తెలిపారు.

## కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పని తీరు భేష్

-కేవికే అధిపతి డాక్టర్ బిజి రాజులు

వెంకటగిరిరూరల్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:

వెంకటగిరిలోని పెరియవరం కృషి విజ్ఞానకేంద్రంలో కొత్త మినుము వంగడపు దినోత్సవం నిర్వహించారు. అయితే కృషి విజ్ఞాన కేంద్రం హార్టికల్చర్ శాస్త్ర వేత్తలు టిబిజి 104 రకం మినుము వంగడాలను రైతులకు సామూహిక త్రితీయ శ్రేణి ప్రదర్శనలో భాగంగా 100 ఎకరాలకు పంచడం జరిగిందని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బిజి రాజులు అన్నారు. ఈ రకం టిబిజి -104రైతులకు తక్కువ పెట్టుబడితోఅధికదిగుబడులు ఇస్తుందన్నారు. రైతులకు అధిక లాభలు వచ్చే ఆలోచనతో పెరియవరం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్తలు మరియు సిఆర్‌డి ఇన్‌చార్జీ యస్ఎం శైలజ ఈ కొత్త రకం రైతులకు ఉచితంగా అందచేయడంఅభినందనీయమని శాస్త్రవేత్త శైలజను మరియు కృషి విజ్ఞాన కేంద్రంశాస్త్రవేత్తలనుడాక్టర్ బిజి రాజులు ప్రత్యేకంగా అభినందిచారు.

## పాఠశాలకు అడ్డంగా మట్టితోలిన మాజీ కౌన్సిలర్

కమిషనర్‌కు స్థానికుల ఫిర్యాదు

వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త



స్థానిక ఉపాధ్యాయ నగర్‌వద్ద ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల రహదారిని ఆక్ర మించేందుకు మాజీకౌన్సిలర్ రాఘవరెడ్డి రోడ్డు మీద మట్టినితోలారని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా మాజీ కౌన్సిలర్ పాఠశాల రహదారినిఆక్రమించేందుకు ప్రయత్నాలుచేస్తున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొ న్నారు. రోడ్డుకు అడ్డంగామట్టి తోడవడం వల్ల విద్యార్థులు పాఠశాలకు వచ్చేందు కు ఇబ్బందిగా ఉందని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని మట్టి గొట్టెను తొలగించాలని స్థానికులు కోరారు.

## ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పిడి శ్రీనివాస ప్రసాద్

వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డ్వామా పిడిశ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలంలో 20 పంచాయితీల్లో జరిగిన ఉపాధి హామీపథకం సామాజిక తనిఖీల నివేదిక రికార్డులను పిడి పరిశీలించారు. 20పంచాయితీల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులు సామాజిక ఆడిట్ రికార్డులను పరిశీలించారు. పనులు సక్రమంగా చేయించని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేసారు. పనులు సక్రమంగాచేయకపోతే ఉద్యోగాల నుండి తొలగి స్తామనిహెచ్చరించారు. ఈకార్యక్రమంలో అంబుడ్స్ మెస్ రాసరాయుడు, విజిలెన్స్ అధికారిని భాగ్యలక్ష్మి, ఏపిడి ప్రేమ్‌కుమార్, ఏపిఓ దీప పాల్గొన్నారు.

## బీఎస్పీని భారీ మెజారిటీతో గెలిపించాలి

రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి



బాలాయపల్లి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త

త్వరలో జరిగే ఎన్నికల్లో బిఎస్పీ పార్టీని భారీ మెజారిటీతో గెలి పించాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరం జ్యోతి కోరారు. బాలా యపల్లిలో జరిగిన బీఎస్పీ సమావేశంలోఆయన మాట్లాడుతూ తిరుపతిపార్లమెంట్ అభ్యర్ధిగా పి. గురప్ప, వెంకటగిరి అభ్యర్ధిగా పి.జయచంద్రాలనుపోటీ లోవుంటా న్నారు. గురప్ప, విజయ కుమార్, జోరెపల్లి వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏర్పాటులో యువతే కీలకం

మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త



రాష్ట్రంలోప్రభుత్వఏర్పాటులోయువతఅత్యధిక ప్రాధా న్యత కలిగి ఉంటారని, అలాంటి యువత తెలుగుదేశం వైపు మొగ్గుచూపడం శుభపరిణామమని మాజీ ఎమ్మె ల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మాయాబజార్ ప్రాంతానికి చెందిన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగాసునీల్‌మాట్లాడుతూ పార్టీ అధి కారంలోకి వచ్చిన తర్వాత యువతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు పులిమిశ్రీనివాసులు, సీనియర్ నాయ కులు సేలం కిరణ్ కుమార్, గుండాల భారతి పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

లయన్స్ గవర్నర్ వై. నాగేశ్వర యాదవ్

గూడూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త



గూడూరు లయన్స్ క్లబ్ జిల్లాలోని సీనియర్ క్లబ్ అని గత 56 సంవత్సరాల నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలునిర్వహిస్తుందని లయన్స్ క్లబ్ గవర్నర్ నాగే శ్వర రావు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు మండలం విందూరులో హై స్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ సామగ్రి, స్కూలుకుబ్యాటరీ విందూరు కాలనీ పేదలకు దుప్పట్లును ఆయన పంపిణీ చేశారు. అదే విధంగా గూడూరు సరస్వతి శిశు మందిరంలో పేదలకు సరుకులు, గిరిజనులకుచీరలు, పేద మహిళ జీవనో పాధి కొరకు నూతన కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్, క్లబ్ సెక్రటరీ కె. శివయ్య ట్రెజరర్ పి. వీరేంద్రనాథ్, జోన్‌చైర్మన్‌గురునాథం, సోమిశెట్టి చెంచురామయ్య, మురళి రెడ్డి, రామ్మోహన్‌రావు, రూపేష్‌రెడ్డి, రమణయ్య, పంచాయితీరాజ్‌డిఇ రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేట ఎంపిడిఓగా ప్రేమ్‌రాజ్‌కుమార్

నాయుడుపేట రూరల్ పిబ్రవరి 2 ప్రభాతవార్త ;



నాయుడుపేట మండలపరిషత్‌అభివృద్ధి అధికారిగా ఎ ప్రేమ్ రాజ్‌కుమార్‌శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. ఆయన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం ఎంపిడిఓగా పనిచేస్తూ బదిలీపై నాయు డుపేటకు వచ్చారు. నాయడుపేట ఎంపిడిఓగా పని చేస్తున్న శివప్రసాద్ చిత్తూరుజిల్లా కెవిపిపురానికి బదిలీపై వెళ్ళారు. భాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ కార్యాలయంలో పలురికార్డులను పరిశీలించారు.

## పలమనేరు మార్కెట్ యార్డ్ వద్ద ఉద్రిక్తత

-శివుని కుప్పం మార్కెట్ దుకాణాల వేలాన్ని అడ్డుకున్న టిడిపి నాయకులు



పలమనేరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:

పలమనేరు మార్కెట్ కమిటిలో శుక్రవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలోని వి.కోట మండలం శివునికుప్పం ఉపమార్కెట్ యార్డ్‌లో నూతనంగా 42 దకాణాల వేలాన్ని పలమనేరు మార్కెట్ కమిటీలో నిర్వహించారు. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా వైకాపా నాయకులు వారి సానుభూతిపరులకు ఇతర రాష్ట్రాల వారికి లక్షల రూపాయలు తీసుకుని దుకాణాలను కేటాయించేం దుకు రహస్యంగా వేలాన్ని నిర్వహిస్తున్నారంటు నియోజకవర్గ టిడిపి నాయకులు ఆ వేలంపాటను అడ్డుకున్నారు. దీంతో మార్కెట్ కమిటిలో ఉద్రిక్తత నెలకొంది. వేలం పాటను పారదర్శకంగా నిర్వహించాలంటు వేలం పాటను వాయిదా వేసి మరో రోజు బహిరంగ వేలం నిర్వహించాలంటు టిడిపి నాయకులు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

## సకాలంలో పేదలకు పిడిఎస్ బియ్యం

**ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ప్రభుత్వం నిరుపేదలకు రేషన్‌కార్డుల ద్వారా అందించే బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు సకాలంలో డీలర్లు, ఎండి ఆపరేటర్లు రేషన్‌కార్డుదారులకు అందించాలని స్పెషల్ ఆఫీసర్ శైలజ పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ శైలజ శుక్రవారం మండలంలోని చిలమాకులపల్లి, డికె మర్రిపల్లి, మర్రిపల్లి, జిఎంఆర్ పురం గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వన్నియకులక్షత్రియులకు పెద్దపీట వేసింది చంద్రబాబే

**- ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో ఉన్న వన్నియ కులక్షత్రియులకు పెద్దపీట వేసింది తెదేపా అధినేత చంద్రబాబు నాయుడేనని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం జయహో బిసి కార్యక్రమంలో భాగంగా సామగుట్టపల్లి ఆలయంలో పూజలు చేసిన అనంతరం వన్నియకులక్షత్రియులకు చంద్రబాబుచేసిన పనుల కరపత్రాలను పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఐదు కోట్ల విలువ చేసే స్థలం, రెండు కోట్ల నిధులు వన్నియకులక్షత్రియ భవనానికి చంద్రబాబు మంజూరు చేసి నిర్మించారన్నారు. వైకాపా ప్రభుత్వంలో ఈ భవనానికి రంగులు వేసి తామే నిర్మించినట్లు హడావుడి చేసి ప్రారంభిం చారన్నారు. మరలా తెదేపా ప్రభుత్వం అధికారంలో రాగానే యామిగానిపల్లి, కర్లగట్ట, పిబి నత్తం గ్రామాల్లోని ధర్మరాజుల ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కమ్యూనిటీ భవనంను మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం సామగుట్టపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించారు. ఇటీవల బంగానత్తం చెరువులో మృతి చెందిన సంజయ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్ చార్జ్ పిఎస్ మునిరత్నం, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సాంబశివం, కాణిపాకం వెంకటేష్, జిఎం రాజు, మురళి,సురేష్, రవి,ఈశ్వర్, డా॥ కృష్ణ, కౌన్సిలర్ సెల్వరాజ్, వేణు, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నిస్తే కేసులా..?



**నారాయణవనం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** పెళ్లైన ఆరునెలలకే అదనపు వరకట్నం కావాలంటూ వధువును అత్తారింటి వారు వేధించడాన్ని ప్రశ్నించినందుకు అమె తండ్రిపై పోలీసులు కేసులు పెట్టడం ఎంత వరకున్యాయమని సత్యవేడు నియోజకవర్గ సిఐటియు డివిజన్ కార్యదర్శి, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దాసరి జనార్ధన్ మండిపడ్డారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం ఆవిడిలోని మిట్లమల్లికి చెందిన గోపాల్ కుమార్తె తిలకవతికి, నారా యణవనం మండలం సముదాయం గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు ఎన్‌దినేష్‌తో జూన్ 13, 2022లో పెరంబూర్‌లో భారీ లాంఛనాలతో వివాహం జరిగింది.పెళ్లైన ఏడు నెలలకే భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవులు రావడంతో దీన్ని ఆసరాగా తీసుకొని అబ్బాయి తరపున తల్లి, తిలకవతిని నిత్యం గొడవతో, అదనపు కట్నం తీసుకురావాలని వేధించేవారు. ఈ సమాచారాన్ని తిలకవతి తండ్రి గోపాల్‌కి సమాచారంఅందించింది. కూతురుకు జరుగుతున్న అన్యా యాన్ని ప్రశ్నించడానికి సముదాయం వచ్చి గ్రామపెద్దల సమక్షంలో సమావేశం పెట్టారన్నారు. తన కూతురుకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించే సమయంలో అబ్బాయి తరపున బంధువులు వాగ్వివాదానికి దిగడం, అతన్నే కొట్టి అతనిపై పోలీసుస్టేషన్‌లో కేసులు పెట్టించారని మండిపడ్డారు. సముదాయం గ్రామానికి చెందిన అబ్బాయి తల్లితండ్రులు రాజకీయ బలంతో కేసులు పెట్టారని ఇది న్యా యంకాదన్నారు. ఉపాధిహామిలో పని చేస్తున్న నాగరాజు, అతని భార్యపై చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు. రైల్వేశాఖలో పని చేస్తున్న తలకవతి తండ్రి గోపాల్‌కు న్యాయం చేయాలని కోరారు.

## 8వ తేదీలోపు హౌస్‌సైట్ రిజిస్ట్రేషన్లు పూర్తి

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**

**చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 8వ తేదీకల్లా జిల్లాలో హౌస్ సైట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు డిఆర్‌ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం రాత్రి తహసిల్దార్లు, ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలు, ఇఓఆర్డీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హౌస్ సైట్లపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారని, ఈ క్రమంలో 8వ తేదీ నాటికి జిల్లాలో వంద శాతం హౌస్ సైట్ రిజిస్ట్రేషన్లు పూర్తి అయ్యేలా పంచాయతీ సెక్రటరీలు విఆర్‌ఓలను సమన్వయం చేసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఇంటి పట్టాలు పొంది ఇంటి నిర్మాణం చేపట్టని లబ్దిదారులతో మాట్లాడిన తరువాత సైతం వారు నిర్మాణానికి ముందుకు రాకుంటే అలాంటి పట్టాలను రద్దు చేయాలన్నారు. జిల్లాకు 3,08 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని వీటిని డిఎంహెచ్‌ఓ ద్వారా ఎంపిడిఓలకు పంపిణీ చేయడం జరిగిందని, ఎంపిడిఓలు పంచాయతీ సెక్రటరీల ద్వారా వంద శాతం ఇకెవైసి చేసి ఆదివారం సాయంత్రానికి వంద శాతం పంపిణీ చేయాలని జెసి ఆదేశించారు. అలాగే ఇది వరకు ఎండి వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ పంపిణీ సమయంలో కార్డుదారులు రెండు సార్లు వేలి ముద్రలు వేసి బియ్యం, ఇతర వస్తువులను తీసుకోవాల్సివుండేదని, ఈ రోజు నుండి అన్ని వస్తువులను ఒకే వేలిముద్ర వేసి తీసుకోవచ్చునన్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రభావతిదేవి, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డిఎస్‌ఓ శంకరన్, సివిల్ సప్లై డిఎం మోహన్‌బాబు, డిఎల్‌డిఓ రవికుమార్‌పాల్గొన్నారు.

## పెట్టుబడులు ఆకర్షించి చిత్తూరులోనే యువతకు ఉపాధి

**- ఎంసి విజయానందరెడ్డి**

**చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** చిత్తూరు నియోజకవర్గంను అవినీతి రహితంగా పెట్టుబడులను ఆకర్షించి నిరుద్యోగ యువతీ యువకులకు చిత్తూరులోని ఉన్నత శ్రేణి ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు న్యాయవాదులతో ఎంసి విజయానందంరెడ్డి శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు నగరానికి సమీపంలో 4,500 మంది యువతకు బెంగళూరు నగరంలోని ఉద్యోగులకు ధీటుగా కార్పొరేట్ స్థాయి జీతభత్యాలతో ఉపాధి కల్పనకు కృషి చేశానని, భవిష్యత్తులో సైతం ఇదే పంథాను కొనసాగిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి సినీపక్కీలో ఎర్రచందనం స్వాధీనం

**సదుం,ఫిబ్రవరి 2ప్రభాతవార్త**



ఎర్రచందనం రవాణా చేస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్సు సిబ్బంది,పోలీసులు సినీపక్కీలో వెంటాడి మరీ ఎర్రచందనాన్ని,వాహనాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన సదుం వద్ద జరిగింది. టాస్క్‌ఫోర్సు ఎస్ఐవిశ్వనాథం కథనం మేరకు అన్నమయ్యజిల్లా రాయచోటినుంచి గురువారం రాత్రి ఎర్రచందనం తరలిస్తు న్నట్లువారికి సమాచారం అందింది. దీంతో వాహనాలను తనిఖీ చేయసాగారు. అదే సమయంలో కలికిరి మార్గం వైపు నుంచి ఎరుపురంగు స్కార్పియో ఒకటి ఆగకుండా స్పీడుగా వెళ్లింది. దీంతో సిబ్బంది దానిని వెంబడించారు. ఎంత దూరం వెళ్లినా ఆగకుండా వెళుతూ వాహనం సదుం వైపునకు మళ్లింది. దీంతో వెంటనే సదుం పోలీసులుకు సమాచారంఅందించారు. సదుం పోలీసు సిబ్బంది మురళి,భాస్కర్‌లువాహనాన్ని ఆపేప్రయత్నంచేసారు. ఆపకుండా వెళ్లిపోవడం తో వీరుకూడా వాహనాన్ని వెంబడించారు. ఒక్కసారిగా అందరు వెంబడించడం తో వాహన ఛోదకులు దానిని గుండ్లూరువారిపల్లె సమీపంలో వదలి పారి పోయారు. ఆవాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 9 ఎర్రచందనం దుంగలు కనపడ్డాయి.వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు ఏపీ27కే 0009 అనే స్కార్పియోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భువనేశ్వరికి ఘన స్వాగతం పలికిన టిడిపి నాయకులు

**వెంకటగిరి, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**

నిజం గెలవాలి కార్యక్రమానికి హాజరైనందుకు నియోజకవర్గానికి వచ్చిన నారా భువనేశ్వరికి టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు పప్పుచంద్రమౌళిరెడ్డి, మాజీఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం తదితరులు ఘన స్వాగతంపలికారు.చంద్రబాబు నాయుడుని జైల్లో పెట్టినందు వల్ల నియోజకవర్గంలో ఇద్దరు మనస్థాపానికి లోనై మృతి చెందినట్లు ఎమ్మెల్యే ఆనం,మాజీఎమ్మెల్యే కురుగొండ్ల ఆమెకు వివరించారు.

చేనేత హస్తకళా వస్త్రాలను ఆదరించి మరింత ప్రోత్సహించాలి

## మేయర్ డా. శిరీష పిలుపు

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త**



చేనేత హస్తకళా వస్త్రాలను ఆదరించి మరింత ప్రోత్సహించాలని మేయర్ డా. శిరీష పిలుపునిచ్చారు. శుక్రవారం భావన రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సమితి సొసైటీ ఆధ్వర్యంలో త్యాగరాజు మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్త కళా ప్రదర్శనను మేయర్ డాక్టర్ శిరీష శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో భారతీయ సంపదైన చేనేత, హస్తకళా రూపాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో భావన రుషి చేనేత హస్త కళా కార్మిక సేవా సమితి సొసైటీ వాటిని ప్రజలకు అందుబాటులోకి తేవడంతో పాటు కళాకారులను మరింత ప్రోత్సహిస్తూ ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ చేనేత హస్తకళ వస్త్రప్రదర్శనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. త్యాగరాజ మండపంలో నేటి నుంచి ఈనెల 25వ తేది వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. తమ వస్త్రాలను ఏర్పాటు చేసి సరసమైన ధరలకే అందిస్తున్నాన్నారు. సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేసామని ఇందులో పోచంపల్లి, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కాటన్ వస్త్రాలతో పాటు జైపూర్ బెడ్ షీట్స్ , ఖది షర్ట్స్, అన్ని రకాల కాటన్ వస్త్రాలు లభిస్తాయని నిర్వాహకులు సింహాద్రి, సురేష్‌లు తెలిపారు.

## ఎన్నికల జాబితాలో ఎలాంటి పొరబాట్లు ఉండకూడదు

**ఓటర్ నమోదు అధికారి అధితి సింగ్**

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త** ఓటర్‌జాబితాలో ఎలాంటి పొరబాట్లు రాకూడదని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అధితి సింగ్ అన్నారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియంలో శుక్రవారం బూత్ లెవల్ ఆఫీసర్లు , సెక్టోరల్ ఆఫీసర్లతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓటర్ జాబితాను మరింత క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎక్కడైన పొరబాట్లు జరిగి ఉన్నాయా అని చూడాలని ముఖ్యంగా మృతి చెందిన వారి ఓట్లను తొలగించేటప్పుడు డెత్ సర్టిఫికెట్స్ తీసుకున్నారా లేదా అని చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అదనపు అధికారులు అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్‌ఈ మోహన్, ఆర్వో సేతుమాధవ్, సెక్టోరల్ ఆఫీసర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజలకు చేరువైన పాలన - మంత్రి ఆర్.కె. రోజా

**పుత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త**



సచివాలయ వ్యవస్థతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు చేరువ చేశారని రాష్ట్ర టూరిజం , సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు మండలం వేపగుంటలో 40లక్షలతో నిర్మించినే నూతన సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ తెచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనకు సిఎం జగనన్న విశేష కృషి చేశారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు వారి ఇళ్ల వద్దకే వెళ్తున్నాయంటే అది సచివాలయాల స్థాపనతోనే అన్నారు. ప్రజలు పథకాల్లో లబ్దికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే అవస్థలు తప్పాయన్నారు. నేడు సంక్షేమ పథకాల్లో ఎలాంటి అవినీతి, అవకతవకలు లేకుండా ప్రజల అర్హతను బట్టి వారికి వాలంటీర్ల ద్వారా నేరుగా లబ్ది కలిగిస్తున్నట్లు తెలిపారు. కోవిడ్ సమయంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా సహాయక చర్యలను మన రాష్ట్రంలో చేపట్టేందుకు సచివాలయాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. ప్రజల ఆశీర్వాదాలే వైకాపాకు శ్రీరామరక్ష అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మునివేలు, సర ్పంచ్ గిరిజా ప్రసాద్, మాజీ ఎంపిపి లక్ష్మణమూర్తి, సచివాలయ కన్వీనర్,జిల్లా ఎస్సీ సెల్ జాయింట్ కార్యదర్శి నరసింహులు, నాయకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే మంత్రి రోజా పుత్తూరు పట ్టణంలో బలిజ సేవా సంఘం నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బలిజ సేవా సంఘం నేతలు, ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సింగిరికోన లక్ష్మీ నరసింహుని సేవలో ఎస్‌సివి నాయుడు

**నారాయణవనం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు అటవీ ప్రాంతంలో ప్రసిద్ది చెందిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామిపి శ్రీకాళహస్తీ మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు శుక్రవారం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఛైర్మన్ పి గుణవంతరావు, సభ్యులు పి గిరిబాబు, పి భాస్కర్‌బాబులు ఘనస్వాగతం పలికి స్వామి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వాధించారు. స్వామి మహ ప్రసాదాన్ని అందజేశారు.

## దేవస్థానం భూములను పరిశీలించి ఛైర్మన్

**శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న 42 ఎకరాల స్థలంను శుక్రవారం ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలోని చుక్కలనిడిగల్లు గ్రామంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంకు 42 ఎకరాల భూమి ఉంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం భూముల్లో 18 ఎకరాల్లో ఉన్నతోట పరిశీలించి మొన్న తుఫానుకు అన్ని తైలం చెట్లు నేలకు ఒరిగిపోయిన వెంటనేఅధికారుల దృష్టికి తీసుకువచ్చి టెండర్లు పిలచి అన్ని చెట్లను తొలగించి భూములను శుభ్రం చేయిస్తామన్నారు. భూములు అన్యాక్రాంతం కాకుండా భూమి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చుక్కలనిడిగల్లు సర్పంచ్ చుక్కల కిరణ్, మరియు దేవస్థానం స్తపతి కుమార్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అలా వచ్చి ఇలా వెళ్ళే వారు కావాలా : బియ్యపుశ్రీవాణి

**తొట్టంబేడు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



అందుబాటులో ఉండే తన భర్త ఎంఎల్ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డి కావాలా, ఎన్నికల వేళల్లో అలావచ్చి ఇలా వెళ్ళేవారు కావాలా ప్రజలే నిర్ణయిస్తారని ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిన్న సింగమాల పంచాయతీలోని పెద్దసింగమాల హరిజనవాడ, చిన్నకన్నలి ఎస్టీ కాలనీలో ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ది పొందిన లబ్దిదారులతో మమేకమవుతూ తాము గెలిచినప్పటి నుంచి అనునిత్యం ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన తన భర్త బియ్యపు మధుసూధన్‌రెడ్డికి ప్రజలందరి ఆశీర్వాదాలు అందించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమానికి ముందుగా మండల అధ్యక్షుడు, వైకాపా సీనియర్ నాయకలు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నం నిర్మలమ్మ కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిరత్నం, పిఎసిఎస్ ఛైర్మన్ పోతుగుంట మణిబాబునాయుడు, పార్టీ కన్వీనర్ శంకరయ్య, రవీందర్‌రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ భక్తవత్సలం, రమణయ్యానాయుడు, కోవి చంద్రయ్య నాయుడు, డిల్లీబాబు, భాస్కర్, గరటారెడ్డి, శ్రీరాములురెడ్డి, సునంద, సునీత, సుబ్రమణ్యంనాయుడు, గురవారెడ్డి, గిరిరెడ్డి, మోహన్, రవీంద్రనాయుడు, వెంకటరమణనాయుడు, షబ్బీర్, సురేష్‌రెడ్డి, రఘునాధరెడ్డి, రఘురాం, ప్రకాష్‌రెడ్డి, ప్రేమ్, గిరి, షఫి వినోద్, గురుమూర్తి, వేమాలయ్య, చెంచురామిరెడ్డి, కొన్నలి రమేష్, గొట్టిపూడి మోహన్, కోగిలమణి, జగదీశ్వర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సుబ్బరామయ్య, వినోద్, వెంగళరావు, రమణారెడ్డి, దీపక్, మోహన్, నరసింహులు జగదీష్, గంధం ఆనంద్, తీర్ధరామన్ చోడవరం, భాస్కర్‌రెడ్డి, కోగిలమనోజ్, మణి, శ్రీను, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, సుబ్బారాయుడు, వెంకి, సుబ్బయ్య, అల్లయ్య, రమణారెడ్డి, రంగయ్య, చంద్రబాబు, గోపినాయుడు, సుబ్రమణ్యంనాయుడు, సుబ్రమణ్యంయాదవ్, నరసింహనాయుడు, వెంగళరావు, దీపక్, మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతపురంలో మహిళ మిస్సింగ్!

**-కారు చోరీ కేసులో హంతకుల అరెస్ట్...డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్**

**చంద్రగిరి, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:**



కారు చోరీ కేసు దర్యాప్తు చేపట్టిన చంద్రగిరి పోలీసులకు అనంతపురంలో నమోదైన మహిళ మిస్సింగ్ కేసులో హంతకులు పట్టుబడిన సంఘటన చంద్రగిరిలో చోటుచేసుకున్నది. శుక్రవారం డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్ వెల్లడించిన వివరాల మేరకు.. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు చంద్రగిరి మండలంలో జరిగిన కారు చోరీ కేసును తన ఆధ్వర్యంలో సిఐ రాజశేఖర్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం తిరుపతి రూరల్ మండలం, సి.మల్లవరం క్రాస్ వద్ద గండవరం అప్పారావు, అతనికి సహకరించిన సురేష్, శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేసినట్లు తెలిపారు. తమ విచారణలో నిందితులు నరేంద్రనాద్ రెడ్డి వద్ద గండవరం అప్పారావు, ఓబులేసు, రఘుపతి రాజు కలసి పనిచేసినట్లు తెలిపారు. అనంతరంలో వున్న సమయంలో నరేంద్రనాద్ రెడ్డి తాడిపత్రికి చెందిన జయమ్మ అనే మహిళతో సహజీవనం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో వీరికి ఒక కుమారుడు కలిగినట్లు తెలిపారు. అక్కడి వరకు అంతా సవ్యంగా సాగినప్పటికీ నరేంద్రనాద్ రెడ్డి మరో మహిళను వివాహం చేసుకుని చంద్రగిరి మండలం, బుచ్చినాయుడు పల్లిలో దున్నలు, పొట్టేళ్ళు, నాటుకోళ్ళ ఫామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయమ్మతో తనకు కలిగిన కుమారుడు శరణ్ కుమార్ రెడ్డి బలవంతంగా తీసుకురావడంతో పెళ్ళి విషయం తెలుసుకున్న జయమ్మ తరచూ ఇక్కడికి వచ్చి తనకుమారుడిని తనకు ఇవ్వాలని పలుమార్లు గొడవ చేసేది. గత ఏడాది మే 25న జయమ్మ కోళ్ళ ఫామ్ వద్దకు వచ్చి గొడవ చేసుక్తుండగా తన వద్ద పనిచేస్తున్న ఓబులేసుతో జయమ్మ చంపమనడంతో ఓబులేసు పికాసితో ఆమె తలపై బలంగా కొట్టడంతో చనిపోయింది. అదే రోజు రాత్రి నరేంద్రనాధ్ రెడ్డి, ఓబులేసు, అప్పారావు, రఘుపతిరాజు కారులో మృతదేహాన్ని తీసుకుని అన్నమయ్య జిల్లా, రాజంపేట సమీపంలోని చెయ్యూరు చెరువు వద్ద వంకలో పాతిపెట్టారు. ఈ మేరకు విచారణలో వెళ్ళడించిన సమాచారంతో మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. నరేంద్రనాద్ రెడ్డి తమకు రూ.5 లక్షలు ఇస్తానని ఇవ్వకపోవడంతో కారును చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. పారిపోయిన నిందితుల కోసం గాలిస్తుండగా లభించిన సమాచారంతో గురువారం కళ్యాణీ డ్యామ్ మలుపు వద్ద నరేంద్రనాద్ రెడ్డి, ఓబులేసులను అరెస్ట్ చేసినట్లు వెళ్ళడించారు. కేసును సమర్థవంతంగా ఛేదించిన బృందంలోని డిఎస్పీ, సిఐతో పాటు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జె.బాలకృష్ణ, కానిస్టేబుళ్ళు పి.జాకీర్ హుస్సేన్, పి.ఎల్.కార్తీక్, మునిరత్నం, ఎస్.గోపి, వేణుగోపాల్, అన్వర్ భాషాలను ఎస్పీ అభినందించి, రివార్డులతో సత్కరించినట్లు తెలిపారు.

## పిఇఎస్ వైద్య కళాశాలలో...

**రాష్ట్ర స్థాయి పరిశోధన పద్ధతుల వర్క్‌షాప్**

**కుప్పం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



కుప్పం పిఇఎస్ వైద్య కళాశాలలో రాష్ట్ర స్థాయి పరిశోధన పద్ధతుల వర్క్‌షాప్‌ను డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు ప్రారంభించారు. ఈసందర్భంగా పరిశీలకుడు ఎపి మెడికల్ కౌన్సిల్‌కు చెందిన డా॥ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వివిధ పరిశోధన పద్ధతులు, గణాంక విశ్లేషణ పద్ధతులు, నైతిక పరిగణనలపై సన్నద్ధం చేసే విధంగా ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. వివిధ ర ంగాలకు చెందిన ప్రఖ్యాత నిపుణులు ఆయా రంగాలకు సంబంధించిన విశ్లేషణలు వివరించారు. డీన్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ అత్యాధునిక పరిశోధన పద్ధతులు పెంపొందించేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ వర్క్‌షాప్‌ను పిఇఎస్‌లో విజయవంతంగా నిర్వహించడం పిఇఎస్ఐఎంఎస్ఆర్ నిబద్ధతకు నిదర్శన మన్నారు. తమ సంస్థ పరిశోధనల అభివృద్ధికి అనుకూలవాతావరణం అందించేందుకు వైద్య పరిజ్ఞానం, అభ్యాసాల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమాల్లో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాల్ డా॥ ర్యాలి సుబ్బారావు, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఒడి డా॥ చిత్ర నాగరాజ్, ఐఆర్‌సి కన్వీనర్ డా॥ ప్రవీణ్‌కుమార్, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదరించండి ఆందుబాటులో వుంటా

**- వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్**



**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా ఆదరిస్తే ప్రతి ఒక్కరికి అందుబాటులో వుండి వారి సమస్యలను పరిష్కరిస్తానని పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బంగారుపాళ్యంలో కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనను పూతలపట్టు వైకాపా ఇన్‌ఛార్జిగా నియమించారని, జరుగనున్న ఎన్నికల్లో తన అభ్యర్థిత్వంను ఖరారు చేస్తారని చెప్పారు. ఆ ఎన్నికల్లో వైకాపాకు పూర్తి మద్దతు పలికి మంచి మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి అత్యధిక స్థానాలను కైవసం చేసుకొని మరోసారి సిఎంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంపికై రాష్ట్ర పాలన సాగిస్తారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో వైకాపా అభ్యర్థికి 7 వేల ఓట్ల మెజార్టీ చూపించారని ఆ మెజార్టీ మరింత పెంపుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా వున్నప్పుడు అధికారంలో తెలుగుదేశం పార్టీ వుండటంతో ప్రజలకు సరైన న్యాయం చేయలేకపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబికుమార్ రాజా, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారే సోమశేఖర్, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, ప్రకాష్‌రెడ్డి, సర్దార్, సురేంద్రబాబు, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, తోట శ్రీహరి, తోట గోవిందరాజులు, వాణిప్రియ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, మహేంద్ర, సురేంద్రబాబు, అన్ను, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి రూ.65 లక్షలు మంజూరు

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు**



**చిత్తూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ జిడి నెల్లూరు నియోజకవర్గ పరిధిలో రెండు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయడానికి 65 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. జెసి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఐఓసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ యోహాన్ కుమార్ ఐఓసిఎల్ తరపున రూ.65 లక్షల చెక్కును జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్ఆర్ పురం మండలం పిళ్ళారికుప్పంలో కమ్యూనిటీ హాలు, జిడినెల్లూరు మండలం ఆవులకొండలో మైనార్టీ కాలనీ వద్ద సిసి రోడ్డు, డ్రైనేజ్ కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాక్రమంలో ఐఓసిఎల్ డిప్యుటీ జనరల్ మేనేజర్ కెవివి సతీష్‌కుమార్, సీనియర్ ఆపరేషన్స్ మేనేజర్ బాలమురుగన్, ఆపరేషన్స్ మేనేజర్ చిన్నారి, రఘు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో మందుబాబులు వీరంగం

**కోట,ఫిభ్రవరి 2 ప్రభాతవార్త :**

మేజర్ పంచాయతీలోని శ్రీహలక్ష్మమ్మ వీధిలో గురువారం అర్ధరాత్రి కొందరు యువకులు పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టించారు. అంతే కాకుండా మరింత రెచ్చిపోయి అక్కడ ఉ్న ఓ మెటారు సైకిల్‌ను పోలయ్య కు చెందిన గడ్డివామును దగ్ధం చేశారు. దీంతో ప్రాంతవాసులు భయాందోళనకు గురయ్యారు. వారిలో ఒక యువకుడును స్థానికులు పట్టుకొని ప్రయత్నం చేస్తే ఆ యువకులు వారిని కొట్టి అక్కడ నుంచి పారిపోయారు. మందు బాబుల బీభత్సం తో ఈప్రాంత ప్రజలు ఇళ్లల్లోని బయటకు వచ్చేందు భయపడనట్లు తెలిపారు.ఆమేరకు శుక్రవారం మహలక్ష్మీమ్మ వీధి వాసులు కోట పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ విచారిస్తున్నమని పేర్కొన్నారు.

## వైసిపి వైఫల్యాలను వివరించాలి

**గూడూరు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



జనసైనికులు గ్రామ స్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైసిపి విఫల్యాలను వివరించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు పిలుపునిచ్చారు. చిల్లకూరు మండలం పునగుంటపాలెం గ్రామంలో శుక్రవారం జనంలోకి జనసేన, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించేందుకు టిడిపి జనసేన కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఇంద్రవర్ధన్, ఆకుల సుధీర్, హేమంత్, సురేష్, ఈశ్వర్, మహేష్, సునీల్, హరికృష్ణ, సాయి, శివ, వసంత్ పాల్గొన్నారు.

## ఈ నిఘా ఎరికి కోసమో....!?

**నారాయణవనం, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :**



నారాయణవనం బజారువీధిలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని ఆలయంలో టిటిడి అధికారులు కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సిసి కెమెరాలుమర మ్మతుకు గురయ్యాయి. దాని బాగు గోలు చేసుకోవాల్సిన నిఘా విభాగం అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వెంటనే టిటిడి అధికారులు మరమ్మతు గురైన సిసి కెమెరాను బాగు చేయాలని హెచ్చరిస్తున్నారు.

## భక్తుల భద్రతకు ప్రాధాన్యత

**-తిరుమల డిఎస్పీ శ్రీనివాసాచారి**

**తిరుమల,ఫిబ్రవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రానికి దేశం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తుల భద్రతకు ప్రాధాన్యనిస్తానని తిరుమల డిఎస్పీ కె.శ్రీనివాసాచారి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన తిరుమలలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన టిటిడి విజిలెన్స్‌లో పనిచేసిన అనుభవం ఉంది. అటు పోలీసు ఇటు విజిలెన్స్‌తో సమన్వయంతో పనిచేస్తానన్నారు.

